

# వెండి అంచు

- కె.రామలక్ష్మి

కాలేజీ నుంచి వస్తూనే తల్లినేనా 'హై' అనకుండా సరాసరి తన రూంలోకి పోయి తలుపులు దభాలున వేసుకుంది బేబీ. బేబీ రాకని ఆమె సైకిల్ చెప్పినా వంటింట్లోంచి బయటికి రాలేదు పార్వతి - అలవాటుగా తిన్నగా వంటింట్లోకి వచ్చి "ఏం చేశావు ఆకలి ఆకలి" అంటూ అడుగుతుంది కదా అని లేచి చూసింది. కాని బేబీ మూడ్ బాగులేదు కాబోలు - ఆ తలుపు వేసిన పద్ధతి నుంచి గ్రహించింది పార్వతి. ఆమె పెదవుల మీద చిరునవ్వు రాబోయి ఆగిపోయింది. ఒకవేళ - వెళ్లినంత స్పీడు గానూ సడెన్‌గానూ బేబీ వంటింట్లోకి వచ్చి పడొచ్చు. ముఖం మీద నవ్వు చూసి ఉడుక్కోవచ్చు. 'ఎందు కొచ్చిన రగడ' అని వస్తున్న నవ్వుని వెనక్కి తీసుకుంది. 'పోనీలే దానికిష్టమైన పకోడీలు చేస్తా. ఆ వాసనకేనా సర్దుకుని బయటికి వచ్చి గొడవేమిటో మాట వరసగానేనా చెప్పకపోతుందా!' అన్న ధైర్యంతో తన కిష్టమైన పాట కూనిరాగం తీస్తూ టిఫిన్ చేయడంలో పడింది పార్వతి.

'నేనూ ఈ వయస్సులో ఇలాగే ప్రవర్తించేదాన్ని?' అన్న ఆలోచన గతంలోకి తీసుకెళ్లిందామెని. కోపం వస్తే 'లోపలికి పోయి, తీరాక బయటికిరా' అని ఒక్క కసురు కసిరి పంపేది అమ్మ నోరు మూసుకుని పోయేది - లోపలికి. నాన్నగారు మాత్రం 'అది అన్నం తిందా?' అని అడిగితే 'ఆ కోపం భోంచేసింది!' అని అమ్మహేళనగా చెప్తే 'పొద్దుటికి అదే సర్దుకుంటుందిలే. ఏం మార్కులు తక్కువ వచ్చాయా? దేనిలోనైనా పోయిందా?' అని అడిగేసి హాయిగా భోజనం చేసి - పైపు కాల్చుకుంటూ వాలు కుర్చీలో పడుకునేవారు నిద్ర వచ్చేదాకా. తనే ఇక అంతా నిద్రకొరిగాక - ఓ గ్లాసుడు మంచినీళ్లు తాగి పడుకునేది. తెల్లారి మళ్లీ అంతా మామూలే. 'ఏం నిన్న అలా వున్నావు?' అని అమ్మ అడిగితే చెప్పాలని వుండేది. కాని అడిగేవారెవరు? చెప్పినా వినేవారెవరు! 'వెధవ కాలేజీ గోల ఎవరిక్కావాలి? కుఱ్ఱ బుద్ధులు... తల్లితండ్రులు ఎన్నెన్ని కష్టాలు పడి చదివిస్తున్నారో అర్థం అయితే కద!' అని ఓ పాఠం చెప్పేసేది అమ్మ - ఎప్పుడేనా ఓ స్నేహితురాలి కష్టం గురించో బాధ గురించో చెప్పబోతే - అసలు అమ్మా నాన్నా బాధ్యతలేవిటి? పిల్లల మనస్సుని తెలిసీ తెలియకా ఎందుకు బాధపెడతారు? వాళ్ల చిన్నతనంలో ఎలా వుండేవారు... ఆలోచించాలని ప్రయత్నించీ - గ్రహింపుకి రాక వూరుకునేది - పార్వతి. అంత ఛాందసులు మూర్ఖులుగా కన్పించే నాన్నలో తన మనసుకి నచ్చినవాడిని కట్టబెట్టాలన్న చిన్న ఆర్ద్రత పార్వతిని ఆయనగారికి దాసోహం అనిపించింది. లేకుంటే వెనుక ఆస్తిపాస్తులు లేని కృష్ణమూర్తిని తనకిచ్చి పెళ్లి చేసేవారు కాదు... బందరాయిలో వెచ్చని తడిలాగా వుండేది ఆయన మమకారం. అమ్మా అంతే. మనసులో ఎంత ప్రేమ వున్నా పైకి కటువుగా మాట్లాడేది. అభిమానం ప్రేమ పైకి చెప్పడం ఏదో సిగ్గుచేటైన పని అనుకునేదో ఏమో... ఎప్పుడూ దగ్గరికి తీసుకునేది కాదు. ముద్దు చేసేది కాదు!

కారు చప్పుడు విని ఉలిక్కిపడి వర్తమానంలోకి వచ్చి పడింది.

"ఏమిటోయ్? మహా మాడు వాసన అమోఘంగా వస్తూంది వీధిలో దాకా! బేబీ గాని కొత్త వంట ప్రాక్టీసు చేస్తోందా?" అంటూ చేతిలో బ్రీఫ్ కేసు సోఫాలో పడేసి వంటింటికేసి వస్తూ అడిగాడు కృష్ణమూర్తి.

పార్వతి కోపంగా వెనక్కు తిరిగి చూసింది. గరిటలో దేవిన పకోడీలు నల్లగా బొగ్గు ముక్కల్లాగా వున్నాయి. 'నాకెలా తెలియలేదు - మాడిపోయాయని? వాసనే తెలియలేదే!" ఆశ్చర్యంగా వాటికేసి చూస్తూ సగం స్వగతంగా - అంది పార్వతి.

"ఎక్కడికో పారిపోయి వుంటుంది నీ మనసు... అవునా? వాట్ యీజ్ ది ప్రోబ్లెమ్?" అంటూ ఆప్యాయంగా ఆమె భుజాలపై చేయి వేశాడు.

"బేబీ వస్తూనే ఉరుములు, పిడుగులు. అదిగో విను స్టీరియోలో మైకేల్ గాడి గోల. అంటే ప్రోబ్లెమ్ అనేగా అర్థం. కృష్ణా దీన్ని ఎలా అర్థం చేసుకోవాలో నాకు తెలియడం లేదు. అడిగితే కోపం. అడక్కపోతే కోపం. ఎలా చావాలి?" కొత్త వాయి పకోడీలు వేస్తూ కాస్త బాధగా అడిగింది.

నవ్వి "వెరీ సింపుల్. చెప్పినప్పుడు విను. చెప్పకపోతే వూరుకో. ముందు నువ్వు మామూలుగా వుండడం నేర్చుకోవాలోయ్ పార్వతీ - ఈ తరాన్ని అర్థం చేసుకోడం - కొత్త సిలబస్‌లో లెక్కలు నేర్చుకోడం లాంటిదే. అంకెల్లేని లెక్కలు వీళ్లు.. సో, మనకి కాస్త టైము పడుతుంది. నాకు నీ పకోడీల వాసన వల్ల ఆకలి వేస్తూంది. బట్టలు

మార్చుకువస్తా. అలాగే బేబీని కూడా పిలుస్తాలే. మరీ అలా బుర్ర బద్దలు కొట్టేసుకుని అర్థం చేసుకుందుకు ప్రయత్నించకు... ప్రస్తుతం నీ ముద్దుల కూతురు ఓ పజిల్ అనుకో. సాల్వ్ చేయడానికి ప్రయత్నించాలి గాని పూర్తిగా కరెక్టుగా చేయలేకపోయామని బెంగపడకూడదు - పూర్తి చేసేస్తే థ్రిల్ పోతుంది" అంటూ తమ గదికేసి నడిచాడు కృష్ణమూర్తి.

వెడుతున్న అతన్నే చూస్తూ "ఎంత తేలికగా తేల్చేశాడు - సమస్యని... అది బయటికి వచ్చాక కదా తెలిసేది!" అనుకుంది కసిగా.

ఓ పది నిమిషాల తరువాత మైకేల్ జాక్సన్ 'బాడ్' గోల తగ్గిపోయింది. తండ్రీ కూతురు పకోడీలకని వంటింట్లోకి వచ్చారు. వాళ్లకిద్దరికీ ప్లేట్లలో సర్దిపెడుతూ "నువ్వూ కాఫీ తాగుతావా బేబీ" అడిగింది.

"తాగుతాను మమ్మీ" అంటూ తండ్రికేసి ఆరాధనగా చూస్తూ.

"డాడీ ఈరోజు - వెరీ బాడ్ డే. ఎందుకో తెలుసా?" పకోడీ నములుతూ అడిగింది బేబీ.

గట్టిగా నవ్వేస్తూ "ఫన్నీ, చెప్పకుండా ఎలా తెలుస్తుంది బేబీ? నీ బుర్రలో ఏముందో చదవడానికి నేనేం మైండ్ రీడర్‌నా!" అన్నాడు.

ఓరకంట తల్లికేసి చూస్తూ "మమ్మీ కెన్ రీడ్ మీ" అంది నెమ్మదిగా.

"అలాగా! మీ మమ్మీ నన్నూ చదివేసిందిలే. అసలు సంగతి చెప్పు. వాట్ యీజ్ బాడ్?"

"నా క్లాస్‌మేట్ కాలేజీకని వచ్చి - లేచిపోయిందిట డాడీ. ఈరోజు పోలీసులు కూడా వచ్చారు.. నన్ను కూడా అడిగారు, నాపక్కన కూర్చుంటుందని" కంట నీరు వూరింది బేబీకి, అదో పెద్ద అవమానమై పోయినట్లు.

"నీకు తెలుసా?"

తెలుసునన్నట్లు తల వూపింది.

"చెప్పావా!"

లేదన్నట్టు తల వూపింది బేబీ.

"గుడ్. నౌ టెల్ మీ, ఏమైంది?"

"కమల ఎదురుకుండా బడ్డీ కొట్టు దగ్గిర ఎవరితోనో ఎప్పుడూ మాట్లాడేది డాడీ. కాలేజీ ఎగేసి ఎటో వెళ్లిపోయేది కూడా. కానీ ఏమైందో మరి... లేచిపోయిందని చెప్పుకుంటున్నారంతా... ఇంట్లో వాళ్ల నాన్న కొడతారనీ అమ్మ తిడుతుందనీ ఓసారి చెప్పింది. మరెందుకిలా స్నేహం చేస్తున్నావని అడిగాను. 'వాళ్లకి బుద్ధి చెప్పడానికే' అంది. సిల్లీ, పెద్దాళ్లకి బుద్ధి చెప్పడానికి - అలా ముక్కు ముఖం తెలియని వాడితో లేచిపోడమేమిటి? డాడీ, కెన్ షి లివ్ విత్ హిమ్?" చాలా సీరియస్‌గా అడిగింది.

"మనం ఎలా చెప్పగలం బేబీ. నీ కమల కనీసం తల్లితోనేనా తన కోర్కె చెప్పుకుని వుండాలి కద, అప్పుడు... కథ ఇంకోలా ముగిసేదేమో... ఆలోచించు."

"ఐ హేట్ హెర్ పేరెంట్స్!" కసిగా అంది బేబీ.

"ఎందుకు? వాళ్లేం చేశారు?"

"ఆమెని నమ్మలేదు! నమ్మి వుంటే చెప్పి వుండేది కద?" అంది బేబీ.

క్షణం భార్యా భర్తలు ముఖం ముఖం చూసుకున్నారు - వంగి వున్న బేబీ తల మీది నుంచి.

"బేబీ ఒక మాట అడగనా?" సీరియస్‌గా అడిగాడు కృష్ణమూర్తి.

"అడుగు డాడీ."

"నువ్వెవరినైనా ప్రేమిస్తే - అదే దొంగతనంగా నేనా ప్రేమిస్తే... ఇంట్లో చెప్తావా?"

కొంచెంసేపు ఆలోచించింది బేబీ.

"డాడీ ఈ రోడ్‌సైడ్ రోమియోలని బుర్ర వున్న ఎవరేనా ప్రేమిస్తారా! స్టుపిడ్స్ - అసలు నిజంగా నేను ప్రేమించదగిన వ్యక్తి కలిస్తే చెవిపట్టి ఈడ్చుకొచ్చి నీముందు నిలబెట్టనూ! నేను గౌరవించదగిన వాడై వుండాలి డాడీ నేను ప్రేమించేవాడు! చాటు మాటు వ్యవహారం నాకసహ్యం" అంది.

బేబీకి తెలియకుండానే పార్వతి గట్టిగా ఊపిరి పీల్చుకుంది.

"ఐ నో, నాకు తెలుసు - నా కూతురి గురించి" అంటూ లేచి తలమీద చేయి వేసి రాశాడు కృష్ణమూర్తి. ✷

## ఖగోళశాస్త్రం పురోభివృద్ధి

ఆధునిక అంతరిక్ష విజ్ఞానం, ఖగోళశాస్త్రం పాలిట 'బంగారుబాట' కానున్నదని ఖగోళశాస్త్రజ్ఞులు అభిప్రాయ పడుతున్నారు.

అమెరికా అంతరిక్షనౌక వోయేజర్ - 2,1989 ఆగస్టులో నెప్ట్యూన్‌ను దాటే సమయంలో ప్లూటో తప్ప మన సౌరమానంలోని ప్రతి ఉపగ్రహమూ శాస్త్ర పరిశీలనకు గురైంది. ఇటీవల ఖగోళ శాస్త్రజ్ఞులు ఇన్‌ఫ్రారెడ్ (అదృశ్య రక్త) కిరణాల దూరదర్శిని నుపయోగించి, ఉపగ్రహాలు ఉండగల కొన్ని కొత్త నక్షత్రాలను కనుక్కున్నారు. ఇందువలన అంతరిక్షంలోని ఇతర గ్రహాలలో ప్రాణులు, నాగరికతలకు సంబంధించిన వాదం మరింత బలం పుంజుకుంది.

ఇదే సమయంలో లెక్కలేనన్ని కొత్తరకం పాలపుంతలు కన్పిస్తూ, ఊహకందని ప్రపంచస్వరూపం గోచరించసాగింది. కొత్తవి కనుక్కునే కొద్దీ ఈ విశ్వస్వరూపం మరింత జటిలంగా కన్పించసాగింది.

1986వ సంవత్సరంలో హేలీతోకచుక్క ఆగమనంతో ప్రపంచంలో అంతరిక్ష పరిశోధన జరిపేదేశాలు కొత్త సౌరమాన పద్ధతిని కనుక్కోడానికి సంసిద్ధమవుతున్నాయని అంతరిక్ష దర్యాప్తులు తెలుపుతున్నాయి.

21వ శతాబ్దంలో మనిషి పక్కనున్న గ్రహానికి వెళ్ళగలడని, ప్రస్తుతం కుజగ్రహానికి రోబోట్స్ (యంత్రమానవుడు)ను పంపే ప్రయత్నం ఈ సాహస కార్యక్రమాల్లో ఒకటనీ రష్యన్, అమెరికన్ నిపుణులు అంగీకరిస్తున్నారు.

అంతరిక్షానికి సంబంధించిన విజ్ఞానాన్ని పొందాలనే ఆకాంక్ష మితి మీరిపోతోంది. అందుకు సంబంధించిన శక్తియుతమైన దూరదర్శినులను కనుగొనే ప్రయత్నాలు జరుగుతూవున్నాయి.

హవాయి, వెస్టిండీస్ దీవుల మధ్యగల 8,100 కి.మీ. ప్రదేశంలో అనేక దూరదర్శినులు నెలకొల్పబడి 'ఇన్‌టర్ ఫెరోమీటర్' పద్ధతిద్వారా సుదూరంలోవున్న లెక్కలేనన్ని పాలపుంతల పరిశోధనలలో కృషిజరుగుతోందని ఖగోళశాస్త్రజ్ఞులు అంటున్నారు.